విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 21, మార్చి 2025

పేద కుటుంబానికి సాయం

విశాలాంధ్ర -గుంతకల్: పాత కొత్త చెరువు గ్రామంలో నివాసం ఉండే చాకలి శివన్నగారి భార్య చాకలి పార్వతమ్మ 5 రోజుల కిందట అనారోగ్య కారణంతో స్వర్గస్తులు అయినారు. ఈ వృద్ధ దంపతులకు సంతానం లేకపోవడం, కటిక పేదవారు కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని గ్రామ పెద్దలు గుంతకల్ మండల ఇన్చార్జి లిగుమ్మనూరు నారాయణస్వామిని ఆశ్రయించగా రూ.5 వేలు అందజేసి పార్వతమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని నివాళి అర్పించారు. కార్యక్రమంలో నీటి పారుదల సంఘం అధ్యక్షుడు రామచంద్ర, టిడిపి నాయకులు ప్రకాష్ పాల్గొన్నారు.

పప్పు సెనగ కొనుగోలు కేంద్రం ఏర్పాటు..

విశాలాంధ్ర-యాడికి: మండలంలోని వేములపాడు పీఏసీఎస్‌లో పప్పు సెనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి మహబూబ్ భాష పేర్కొన్నారు. ప్రభుత్వమద్దతు ధర క్వింటాలుకు రూ. 5,650గా నిర్ణయించినట్లు తెలిపారు. కాగా రైతులు ముందుదగా రైతు సేవా కేంద్రాల్లో (సీఎం..యాప్ లో) తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. సరుకు చేర్చిన వారం రోజుల్లోగా ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని వెల్లడించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు ఆహ్వానం

విశాలాంధ్ర-ఉరవకొండ/శెట్టూరు : వజ్రకరూరు మండలం తట్రకల్లు కేజీబీవీ పాఠశాలలో ప్రవేశాలకు ఆన్లైన్లో ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ధనలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆరవ తరగతి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు అనాథలు, బడి బయట పిల్లలు పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. శెట్టూరు కెజిబివి పాఠశాల /కళాశాల లో 2025-26 విద్యాసంవత్సరమునకు 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు మార్చి 22 తేదీ నుండిఏప్రిల్ 11తేదీ వరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లలితమ్మ గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 40 సీట్లు మాత్రమే ఉన్నాయని అన్నారు.7, 8, ఖాళీగా వాటికి కూడా హెచ్ టీ టీ పీ ఎస్ ://ఏపీ కెజిబివి. ఏపీసీఎఫ్ఎస్ఎస్. ఇన్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు

మద్దతు ధర కోసం నమోదు చేసుకోండి..

విశాలాంధ్ర-బెలుగుప్ప : రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా రైతుల పండించిన పప్పు శెనగను కనీస మద్దతు ధరపై కొనుగోలు చేయుటకు రైతులు వారి వివరములను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పృథ్వి సాగర్ తెలిపారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.5650గా నిర్ణయించినట్లు చెప్పారు

రైతులతో సమావేశం..

విశాలాంధ్ర-కూడేరు : మండలంలోని జయపురం గ్రామంలో భూములు రీ సర్వేలో భాగంగా రైతులకు నోటీసు ఇచ్చిన భూములుకి హద్దులు కొలతలు చూపారు. వాటికి సంబంధించి గురువారం గ్రౌండ్ వాలిడేషన్ 4 బ్లాకులుగా విభజించి.9,10,11,13రైతుల సమక్షంలో తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, మండల సర్వేయర్ వీఆర్ఓ సాకే గోపాల్, సచివాలయ రెవెన్యూ అధికార్లు పాల్గొన్నారు

చిన్నారుల్లో ఎదుగుదల ముఖ్యం

విశాలాంధ్ర-రాప్తాడు : అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీడీపీఓ ధనలక్ష్మి సూచించారు.అనంతపురం రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రూరల్, ఆత్మకూరు, రాప్తాడు మండలాల టీటీడీసీలోని సీఎల్ఆర్సీ శిక్షణ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ పదాయి బీపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. సీడీపీఓ మాట్లాడుతూ పిల్లలు పుట్టినప్పటి నుంచి ఆరేళ్ళలోపు జరిగే పురోభివృద్ధిపై అవగాహన, వారికి పోషణ, విద్యపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు ఝాన్సీ రాణి, లీలావతి, శ్రీవాణి, హేమలత, లావణ్య, నాగరత్న జయశ్రీ, భారతి పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనుల పరిశీలన

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : మండలంలోని నేమకల్లు గ్రామంలో సిఎం చంద్రబాబు నాయుడు హామీ మేరకు జరుగుతున్న సీసీ రోడ్లు పనులను కళ్యాణదుర్గం డీఎల్‌టీఓ నాగేశ్వరరావు, బొమ్మనహాళ్ ఎంపీడీవో విజయభాస్కర్, ఈఓపిఆర్డీ దాస్ పరిశీలించారు. గ్రామంలో రూ. 3. కోట్లు నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణపు పనుల్లో భాగంగా గురువారం పరిశీలించారు. సీసీ రోడ్లు నిర్మాణపు పనులు అన్ని గ్రామాల్లో నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

అంగన్వాడీ టీచర్లకు శిక్షణ

విశాలాంధ్ర-డీ.హిరేహాల్ : మండలంలోని వెలుగు ఆఫీసులో గురువారం సీడీపీవో పద్మావతి. అధ్యక్షతన 57 మంది అంగన్ వాడీ కార్యకర్తలకు వెలుగు ఆఫీస్‌లో శిక్షణా కార్యాక్రమం నిర్వహించారు. బాల్యారంభ దశలో పిల్లలకు నాణ్యమైన విద్యను అందించుట కొరకు అంగన్వాడీ కార్యకర్తలకు నైపుణ్యాన్ని పెంపొందించే శిక్షణ ఇవ్వడం జరిగింది. ఆదార్ శీల, నవ చాతన అనే రెండు విధాలుగా శిక్షణా ఉంటుంది. 3 నుండి 6 నం? పిల్లలకు పిల్లల ఉండే రకాల గురించి వివరించారు. ఈ పోషగ్ బీ పదాయ బి శిక్షణ కార్యాక్రమానికి పద్మావతి, సూపర్ వైజర్లు నాగరత్న ,ఈశ్వరమ్మ అంజినమ్మ అంగన్వాడీలు పాల్గొన్నారు

ఉచిత కంటి ఆపరేషన్లకు భారీ స్పందన ..

విశాలాంధ్ర,కూడేరు : మండల కేంద్రంలోని అన్ని గ్రామాల ప్రజలకు శాంతి రామ్ మెడికల్ కాలేజ్ వారి ఆధ్వర్యంలో గురువారం కూడేరు గ్రామ పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. భారీ స్పందన లభించింది, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, తెదేపా సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి సూచనల మేరకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, సర్పంచ్ మీనుగలలితమ్మ, అధ్యక్షతన ముఖ్య అతిథులుగా కూడేరు పోలీస్ స్టేషన్ అప్ గ్రేడ్ సిఐ రాజు, పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు మాట్లాడుతూ నంద్యాల శాంతిరామ్ కంటి ఆసుపత్రిలో ప్యాకో సర్జరీ(లేజర్) కంటి ఆపరేషన్లు ఉచితంగా వైద్యం అందిస్తామని తెలియజేశారు, టీడీపీ నాయకులు బాటవెంకటేష్, జయప్రకాష్ గౌడ్, గొల్ల వెంకటేష్ యాదవ్, మరుట్ల బోయ రవి, అక్కులప్ప, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యంతో గ్రామాలలో కూలీలకు పనులు లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి తక్షణమే ఉపాధి హామీ పనులు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి పేర్కొన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విడపనకల్లు మండల పరిధిలోని ఉండబండ గ్రామంలోని సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎం కృష్ణమూర్తి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, జిల్లా నాయకులు పెద్దముష్టూర్ వెంకటేశులు మాట్లాడుతూ విడపనకల్లు మండలంలో ఉపాధి హామీ పనులు కల్పించడంలో ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మండల వ్యాప్తంగా కేవలం రెండు గ్రామాల్లో మాత్రమే 100 మందికి పనులు కల్పించాలని తెలిపారు. ఉండబండ గ్రామంలో పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. విడపనకల్ మండలం కరువు మండలంగా ప్రకటించడంతో వంద రోజులు పూర్తి చేసుకున్న వారికి అదనంగా 50 రోజులు కల్పించారని ఈ అవకాశాన్ని మార్చి చివరి నాటికి ఉపయోగించుకోవాలని ఉన్న అవకాశాన్ని కూడా ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంతో కూలీలకు దూరం చేసిందన్నారు. ఇప్పటికైనా వెంటనే ప్రతి జాబ్ కార్డుకి 150 దినాలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు చేసిన పనులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని పనులు చేసే దగ్గర కనీస సౌకర్యాలు మజ్జిగ,నీడ,టెంటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్టు, పనిముట్లు,గడ్డపార పారా,గంప,గుణపం ఇవ్వాలని కోరారు.

సంపద సృష్టితో గ్రామాలు పరిశుభ్రం..

విశాలాంధ్ర -బొమ్మనహాళ్ : చెత్త నుండి సంపద సృష్టించడం ద్వారా ఆదాయంతో పాటు గ్రామాల శుభ్రంగా ఉంచవచ్చని డివిజనల్ పంచాయతీ అధికారి నాగేశ్వరరావు ఎంపీడీవో విజయభాస్కర్ జిల్లా కోఆర్డినేటర్ సౌజన్యకుమారి పేర్కొన్నారు.. గురువారం మండలంలోని నేమకల్లు గ్రామంలో బొమ్మనహాళ్, డీ. హీరేహాల్ మండలల పరిధిలో ఉండే గ్రీన్ అంబాసిడర్లకు, పంచాయతీ కార్యదర్శులకు చిత్త సేకరణ విధానం, తడి, పొడి చెత్త సేకరణ కంపోర్టు అంశాలపై డిపిఆర్సీ రిసోర్స్ పర్సన్ సౌజన్య ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. కంపోస్ట్ ఎలా చేయాలనే విషయంపై అవగాహన కల్పిం చారు. డిఎల్డిఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ తడి,పొడి చెత్తను ఎలా సేకరిస్తున్నారు? హొటళ్లు, వ్యాపార సముదాయాల నుంచి సేకరించిన చెత్తను కేంద్రాలకు తరలించడం వంటి అంశాలపై వివరించారు. ఒక వార్డును ఎంచుకుని అక్కడ తడి, పొడి చెత్త సేకరణను వంద శాతం అమలు చేసి మరో వార్డుకు వెళ్లడం వంటి పద్ధతులపై అవగాహన కల్పించారు. విం డ్రో కంపోస్ట్ పద్ధతులను తెలిపారు. పాడైన కూరగాయలు, పేడ, ఎండు ఆకులను పొరలుగా అమర్చుకుంటూ విండ్రో కంపోస్ట్ తయారు చేయాలని తెలిపారు. అన్ని పంచాయతీల్లో ఈ పద్ధతులను పాటించాలని సూచించారు. ఈకార్యక్రమంలో బొమ్మనహాళ్, డీ.హీరేహాళ్, ఎంపీడీవో లు విజయభాస్కర్, దాసనాయక్, ఈఓపిఆర్డి లు దాస్, యోగానంద, సర్పంచ్ పరమేశ్, మాజీ సర్పంచ్ బెల్లీ హనుమంత రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శివన్న, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసిన 3నెలల్లోపు వ్యవసాయ విద్యుత్ సర్వీసులివ్వండి

– అసెంబ్లీలో ప్రభుత్వ విప్ కాలవ

విశాలాంధ్ర-బొమ్మనహాల్: ధరఖాస్తు చేసిన 3నెలల్లోపు ప్రతి రైతుకు కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలో గురువారం ఆయన మాట్లాడుతూ...తమ నియోజకవర్గంలో విద్యుత్‌పై ఆధారపడ్డ వ్యవసాయ రంగం అనేక సమస్యలు ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తపరిచారు. దరఖాస్తు చేసి ఏడాదిన్నరైనా వ్యవసాయ సర్వీసులు ఇవ్వటంలో తీవ్ర జాప్యం జరుగుతోం దన్నారు. వెనుకపడ్డ రాయదుర్గం ప్రాంతంలో 2015 జనవరి నాటికి 513 మంది ధరకాస్తుదారులు ఎదురు చూస్తుండగా కేవలం 36 మంజూరు చేశారని వివరించారు. 600-700 అడుగులలోతు తవ్వినా నీరు పడటం లేదన్నారు. ఒకవేళ ఎవరికైనా నీరు పద్దా విద్యుత్ సర్వీసులు ఆలస్యం కారణంగా పంటలు వేసుకోలేని పరిస్థితులున్నాయన్నారు. 12 సబ్ స్టేషన్లు మంజూరైన నేటికి పనులు జరగలేదన్నారు. కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటుకు 464 కిలోమీటర్ల కాండెన్సర్ (అల్యూమినియం వైర్) కావాల్సి ఉందన్నారు. త్వరితగతిన వీటిని మంజూరు చేయడంతో పాటు వ్యవసాయ సర్వీసులు వెంటనే మంజూరుచేసి రైతాంగాన్ని ఆదుకోవాలని విన్నవించారు.

నిధుల కోసం ఉపముఖ్యమంత్రికి ఎమ్మెల్యే శ్రావణి వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర-శింగనమల : శింగనమల నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయాలని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కి గురువారంశింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో కరువు మండలాలకు వేసవి కాలం దృష్ట్యా నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే శింగనమల నియోజకవర్గ పరిధి లో రూరల్ అభివృద్ధి కోసం ఎక్కువగా నిధులు విడుదల చేయాలని వినతి చేశారు. జల్ జీవన్ మిషన్ కింద గతంలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించాలని కోరారు. సమస్యలపై ఉపముఖ్య మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే వెల్లడించారు.

కిచెల్ గార్డెన్‌లతో మనిషి ఆరోగ్యానికి భరోసా

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టండి

జిల్లా రిసోర్స్ సెంటర్ ఆత్మ పిడి మద్దిలేటి

విశాలాంధ్ర-ఉరవకొండ : హెూమ్ కిచెన్ గార్డెన్‌లతో ప్రతి ఒక్కరూ వారి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని జిల్లా రిసోర్స్ సెంటర్ ఆత్మ పిడి మద్దిలేటి సూచించారు. గురువారం ఉరవకొండ డివిజన్ పరిధిలోని గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, విడపనకల్లు మండలానికి చెందిన గ్రామ రైతు సేవ కేంద్ర సిబ్బందికి ఆత్మ పిడితో పాటు ఉరవకొండ డివిజన్ ఏడిఏలు శైలజ, పద్మజ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిద్దె తోటల పెంపకం, కిచెన్ గార్డెన్ ఆవశ్యకత గురించి పూర్తిస్థాయిలో రైతు సేవ కేంద్రం సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. మిద్దె తోటలు పెంచుకోవడం వల్ల రసాయన మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయంతో మనం తినాల్సిన పంటలనుంచి మనమే పండించుకుని తినడం వల్ల ఆరోగ్యము పెంపొందించుకోవడమే కాకుండా ఆదాయము పెరుగుతుందన్నారు. ప్రతి ఆర్ఎస్కే సిబ్బంది మీమీ ఇళ్లలో మిద్దె తోటలను పెంచుతూ మీరు పని చేసే గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పిస్తూ వారి ద్వారా మిద్దె తోటలను వీలైనంత ఎక్కువగా పెట్టుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ఉరవకొండ మండల వ్యవసాధికారి శుభకర్ మాట్లాడుతూ పప్పు సెనగకు ప్రభుత్వం కనీస మద్దతు ధర 5650కు కొంటోందని ప్రభుత్వానికి అమ్మాలనుకున్న రైతులు మీ రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని ఇది ఏపీ మార్కెుడ్ వారి ఆధ్వర్యంలో కొంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏవోలు విజయ కుమార్, మధుకర్, పెన్నయ్య, శుభకర్, ఏఈవోలు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: కార్మిక, ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ నిర్మించుకోవడానికి శిక్షణా తరగతులు ఉపయోగపడుతాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి తెలిపారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాజారెడ్డి మాట్లాడుతూ మార్చి 22,23 తేదీలలో అనంతపురం రూరల్ మండలం, మన్నీల గ్రామం దగ్గర శ్రీకృష్ణ గార్డెన్స్‌లో నిర్వహించబోతున్న ఏఐటీయూసీ అనంతపురం ఉమ్మడి జిల్లా శిక్షణా తరగతులు ఈ నెల22న ఉదయం 10 గంటలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ ప్రారంభోత్సవం చేస్తారని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు, సిపిఐ అనంతపురం జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం. వేమయ్య యాదవ్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగ సుబ్బారెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పి.నారాయణస్వామి, సి.మల్లికార్జున పాల్గొంటారన్నారు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులు ఆటో, హమాలీ,వీధి వ్యాపారుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు బకాయి డీఏలు, సరెండర్ లీవులు చెల్లించాలని ఇతర రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి ఏఐటీయూసీ భవిష్యత్తు కార్యచరణ నిర్ణయిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు శ్రీశైలం రాజేష్‌గౌడ్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు వి.కె.కృష్ణుడు, నగర అధ్యక్షులు జి.చిరంజీవి, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజు, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వెంకటేష్, ఆటో యూనియన్ నగర అధ్యక్షులు దుర్గాప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి నాగేంద్ర విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

డివిజనల్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులుగా కుళ్ళాయప్ప

విశాలాంధ్ర-శింగనమల : అనంతపురం డివిజనల్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ సభ్యులుగా సింగనమల మండలం లోలూరు గ్రామానికి చెందిన బండారు కుళ్లాయప్పకి అనంతపురం ఆర్డీవో నియామక పత్రం అందజేయడం జరిగింది/ ఈ సందర్భంగా బండారు కుళ్లాయప్ప మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీల కోసం సేవ చేయడానికి అవకాశమిచ్చినటువంటి ఆర్డీవో కేశవ నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఎస్సీ ఎస్టీల సమస్యల కోసం నిరంతరం కృషి చేస్తానని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ అమలకు నా వంతు కృషి చేస్తానన్నారు, నియోజకవర్గంలో దళితులపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు శ్రమిస్తానన్నారు.

లైనింగ్ పనులు ఆపండి .. కాలువ వెడల్పు చేయండి

విశాలాంధ్ర-ఆత్మకూరు : హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు కాపీ కాలువ వెడల్పు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నీలపాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆత్మకూరు రైతులకు నష్టం చేకూర్చే హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపకపోతే రైతులు, కౌలు రైతులు కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలంలో హంద్రీ నీవా కాలువ కింద ఉన్న బోర్లు బావులు అడుగంటి పోతున్నాయని, హంద్రీనీవా ద్వారా భూగర్భ జలాలు అభివృద్ధి చెంది ఎన్నో గ్రామాలు లక్షల్లో ఎకరాలు సాగు చేసుకుంటున్నారు. ఇప్పుడు లైనింగ్ పనులు చేస్తామంటే ప్రజలు భారీ నష్టపోతారు. మీరు లైనింగ్ పనులు మొదలుపెడితే యంత్ర సామాగ్రి ధ్వంసం చేస్తామని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. లైనింగ్ పనులు వెంటనే ఆపి టెండర్లు రద్దు చేయాలని రైతులు కోరుతున్నారు.రైతుల మీద అభిమానం ఉంటే హంద్రీనీవా కాలువ వెడల్పు చేసి 10000 క్యూసెక్కులు నీటి ప్రవాహ సామర్థ్యం పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లైనింగ్ పనులు ఆపకపోతే రైతులు, కౌలు రైతులు, సంఘాలు ప్రజా సంఘాలు, వాపక్ష పార్టీలు అందర్నీ కలుపుకొని భారీ ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చ రించారు.ఈ కార్యక్రమంలో రైతులు గోపాల్ నాయక్, నాగరాజు నాయక్, నారాయణ, సూరి, సర్దాని, వెంకటేశు, పుల్లారెడ్డి, బయన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పుస్తకాల వ్యాపారమా ?

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓకి వినతి

విశాలాంధ్ర-బ్యూరో అనంతపురం : రాయదుర్గం పట్టణంలో విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే నారాయణ పాఠశాల యాజమాన్యులు వచ్చే సంవత్సరానికి సంబంధించి తరగతులు మొదలుపెట్టి పుస్తకాలు అమ్మకాలు చేస్తున్న నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం డీఈవో ప్రసాద్ బాబుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతూ మంత్రి నారాయణ తన విద్యాసంస్థలలో పుస్తకాల పేరుతో వ్యాపారం మొదలెట్టారని కుళాయిస్వామి ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపే 9,10వ తరగతి చదువుతున్న వారికి పుస్తకాలు కొనుగోలు చేయాలని తల్లితండ్రులపై ఒత్తిడి తేవడం సిగ్గు చేటన్నారు. ఇ-టెక్నో ఒలంపియాడ్ రకరకాల పేర్లతో ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ. 13 వేల నుంచి రూ.16 వేల వరకు పుస్తకాలు అమ్ముతున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జూన్ మాసంలో విద్యా సంవత్సరం ప్రారంభమవుతే మార్చి నెల నుంచి అడ్మిషన్లు విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి ఈ నెల చేర్చుకుంటే మీకు రాయితీ కల్పిస్తామని కల్ల బొల్లి మాటలు చెప్పి అడ్మిషన్లు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. తక్షణమే రాయదుర్గం నారాయణ పాఠశాలపైన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో నారాయణ పాఠశాలను సీజ్ చేసేంతవరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర సహాయ కార్యదర్శి సమీర్ నాయకులు మోహన్, తరుణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

చంటి పిల్లల తల్లులకు పది మూల్యాంకనానికి మినహాయింపు ఇవ్వాలి

ఎస్టీయూ నాయకులు

విశాలాంధ్ర బ్యూరో -అనంతపురం: త్వరలో జరుగు పదవ తరగతి మూల్యాంకన విధుల నుండి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను చంటి పిల్లలు ఉన్నా మహిళా ఉపాధ్యాయులు, 55 సంవత్సరాలు పైబడిన వారిని మినహాయించా లని విద్యాశాఖాధికారి ప్రసాద్ బాబుకి ఎస్టీయు సంఘం పక్షాన గురువారం వినతిపత్రం అందజేశారు.అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. రమణారెడ్డి, ఎస్.రామాంజనేయులు మాట్లాడుతూ వచ్చేనెలలో జరగబోవు పదో తరగతి మూల్యాంకనానికి సంబంధించి నిబంధనల ప్రకారం సర్వీసును ప్రామాణికంగా తీసుకొని సీనియర్ ఉపాధ్యాయులను మూల్యాంకన విధులు కేటాయించాలని తెలిపారు. అలాగే ఎస్సీఈఆర్టీ సూచనల మేరకు పదవ తరగతి విద్యార్థుల కోసం వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సెలవు రోజుల్లో విధులకు హాజరైన ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని తెలిపారు.

కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యుడు రాష్ట్ర కమిటీ మెంబర్ శివయ్య చారి,రాష్ట్ర కౌన్సిలర్ సురేష్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, జిల్లా, నగర, మండల నాయకులు చంద్రశేఖర్ స్వామి, నాగభూషణ, మురళీకృష్ణ, బాబ్జి నాయక్, సురేష్ కుమార్, రామకృష్ణ, విరుపాక్షి గౌడ్, యుగంధర్, నాగేంద్ర, నారాయణస్వామి, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉదయభానుడి ప్రతాపంతో ప్రజలు బెంబేలు

విశాలాంధ్ర-కనేకల్ : కనేకల్ గ్రామంలో ఉదయం 9 గంటల నుండి మొదలు భానుడి ప్రతాపం మొదలవుతున్నది.. ప్రజలు ఈ ఎండ తీవ్రతకు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఎండవేడికి జనాలకు వడదెబ్బ తగిలి కళ్ళు తిరిగి పడిపోతున్నారు, తీవ్ర ఉక్కబోతతతో పిల్లలు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం అయితే భూముల నుండి వేడి సెగ పడుతోంది.

లోనే ఇలా ఉంటే ఇంకా ముందు నెలలో ఎలా ఉంటుందని ప్రజలు భయపడుతున్నారు, ఆంధ్రప్రదేశ్ అగ్నిగుండంగా మారుతున్నదని, ఈ మార్చిలోనే గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు.జ వేసవికాలం ముగిసే వరకు చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా బయటకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు తెలుపుతున్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర-గుత్తి : ఐసీడీఎస్ కార్యాలయంలో ఐసిడిఎస్ అడిషనల్ సిడిపిఓ నాగమణి ఆధ్వర్యంలో గురువారం అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ బీపడాయి బీ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నాగమణి మాట్లాడుతూ.. పిల్లల పోషణ, పౌష్టికాహారం, పిల్లల చదువు వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు నాగేశ్వరి,షాహిదా,గౌరి,పుష్ప పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులపై దుర్భాషలాడిన సినిమా హాల్ యజమాని

విశాలాంధ్ర, తాడిపత్రి : పట్టణం లోని పోలీస్‌స్టేషన్ సర్కిల్లో ఉన్న ఎస్వీ సినిమా హాల్ (దాదా సినిమా హాల్) వద్ద గురువారం మున్సిపల్ పన్ను వసుళ్ళకు వెళ్లిన మున్సిపల్ రెవిన్యూ ఆఫీసర్ రవిబాబు మున్సిపల్ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్, నోడల్ ఆఫీసర్ దాశరథి సిబ్బందిలపై సినిమా హాల్ యజమాని దుర్భాషలాడిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే 2024-25 సంవత్సరానికి సంబంధించి మునిసిపల్ పన్ను వసూళ్లకై పట్టణంలోని లాడ్జిలు, పెట్రోల్ బంకులు, సినిమా హాళ్ల వద్దకు మున్సిపల్ సిబ్బంది వెళ్లారు. అందులో భాగంగానే ఎస్వీ సినిమా హాల్ వద్దకు వెళ్లి సినిమా హాల్, సినిమాల ముందరన్న షాపింగ్ కాంప్లెక్స్ లో ఒక షాప్ కు సంబంధించి మున్సిపల్ పన్ను దాదాపు 1,80,000/- చెల్లించాలని సినిమా హాల్ యజమాని అడగగా చెల్లిస్తాంలే, ఏయ్ నీ అంత చూస్తాని అని మున్సిపల్ అధికారులపై దుర్భాషలాడినాడు. ఈ విధంగా మున్సిపల్ అధికారులపై దుర్భాషలాడం చట్టరిత్య నేరమని ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

ఏపీ స్టేట్ ఇన్‌చార్జి యాంటీ కరప్షన్ క్రైమ్ కంట్రోలర్‌గా షేక్ మొహమ్మద్ షాకీర్ నియామకం

విశాలాంధ్ర-నార్పల : ఏపీ స్టేట్ ఇన్‌చార్జి యాంటి కరప్షన్ క్రైమ్ కంట్రోల్ సెల్‌గా షేక్ మహమ్మద్ షాకీర్‌ను ఏఐ హెచ్ ఆర్‌పి కౌన్సిల్ జాతీయ చైర్మన్ సిరాజుద్దిన్ ఆదేశాల మేరకు నియమించారు. షేక్ మహమ్మద్ షాకీర్ మాట్లాడుతూ ఎక్కడ మానవ హక్కుల పరిరక్షణకై కృషి చేస్తానని తెలిపారు. పేదలకు రాజ్యాంగం పొందుపరిచిన హక్కుల గురించి అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం ఈ పదవి కల్పించిన జాతీయ చైర్మన్ షేక్ సిరాజుద్దిన్‌కు షేక్ మహమ్మద్ షేకీర్ హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేశారు.

ఇఫ్తార్ విందులో గుమ్మనూరు ఈశ్వర్..

విశాలాంధ్ర-గుత్తి : పట్టణం మెయిన్ బజార్ జామియా మసీదులో ముల్లా బషీర్,కేజీఎన్ షాషా,కేజీఎన్ షఫీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందుకు గుత్తి, పామిడి మండల ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ హాజరయ్యారు. అనంతరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విరమించారు. గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ.. ముస్లిం సోదరుల కోసం ఏర్పాటుచేసిన ఈ ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు ఎంకే చౌదరి,బద్రీవలి, చికెన్ శీనా, ప్రతాప్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 21, మార్చి 2025

ప్రశ్నించిన వారిపై దాడి చేయడం దారుణం

సిపిఐ నాయకులు, జర్నలిస్టులపై దాడి చేయడం బాధాకరం

సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

విశాలాంధ్ర, పుట్టపర్తి: కూటమి నాయకులు చేస్తున్న అన్యాయాలపై ప్రశ్నించిన సిపిఐ నాయకులు, జర్నలిస్టులపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ అనుచరులు దాడి చేయడం దారుణమని శ్రీ సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ సోమందేపల్లి లో ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్న మంత్రి సవితమ్మ అనుచరులను సిపిఐ నాయకులు ప్రశ్నించడంతో దాడికి దిగడాన్ని సిపిఐ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నిబంధనలకు విరుద్ధంగా నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. రైల్వే పనులకు అనుమతులు లేకుండా మట్టిని తరలించి కూటమి నాయకులు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. అడ్డుకున్న ప్రజాసంఘాల నాయకులను మీడియా ప్రతినిధులపై తిరగబడటం చాలా దారుణం అన్నారు. మంత్రి సవితమ్మ నియోజకవర్గంలోనే ప్రజా సంఘాలకు జర్నలిస్టులకు రక్షణ లేకపోతే ప్రజలకు ఏమి రక్షణ కల్పిస్తారని ప్రశ్నిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముదిగుబ్బ సొసైటీ స్థలం ఆక్రమణలను అరికట్టాలి

సిపిఐ నాయకులు చల్లా శ్రీనివాసులు

విశాలాంధ్ర-ముదిగుబ్బ : ముదిగుబ్బ నడిబొడ్డున జాతీయ రహదారి పక్కన ఉన్న కోట్ల రూపాయలు విలువ చేసే సొసైటీ బ్యాంక్ ప్రభుత్వ స్థలం కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ నాయకులు గురువారం ముదిగుబ్బలో సొసైటీ బ్యాంకు సీఈఓ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు, ఆ పార్టీ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ సుమారు రెండున్నర ఎకరాల విస్తీర్ణం గల సొసైటీ బ్యాంక్ స్థలాన్ని ఎవరికి ఇష్టం వచ్చినట్లు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు, ఇప్పటివరకు సుమారు 50 సెంట్ల స్థలం కబ్జాకు గురైనట్లు తెలిసిందన్నారు, ఒక మూలన ఇటీవల అక్రమంగా నిర్మించారని ఒక చిన్న రేకుల షెడ్డును రెండు రోజులు కిందట కూల్చివేసిన అధికార పార్టీ నాయకులు, అధికారులు జాతీయ రహదారి పక్కన కోట్ల రూపాయలు విలువచేసే ఇదే సొసైటీ స్థలంలో అక్రమంగా నిర్మించిన పెద్ద పెద్ద భవనాలను కూల్చి వేయడానికి ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు, గత టిడిపి, వైసిపి ప్రభుత్వంలో అప్పటి నాయకులు భూ కబ్జాదారులతో కుమ్మక్కై ఈ ప్రభుత్వ స్థలంలో జాతీయ రహదారి పక్కనే అక్రమంగా పెద్ద పెద్ద భవనాలు నిర్మించిన పట్టించుకోలేదని ఆరోపిం చారు. సంబంధిత అధికారుల సైతం అప్పటి ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గి తమ సొసైటీ బ్యాంక్ స్థలంలో కళ్ళ ముందరే అక్రమ నిర్మాణాలు జరుగుతున్న ప్రేక్షక పాత్ర వహించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు, వైసీపీ ప్రభుత్వంలో ప్రతిపక్ష నాయకులైన టిడిపి నాయకులు కొందరు ఈ అక్రమ కట్టడాల నిర్మాణంపై హైకోర్టును ఆశ యించిన నేటికీ ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో త్వరలోనే న్యాయస్థానాన్ని ఆశ్రయించి అక్రమ కట్టడాలు కూల్చే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు, జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ సౌత్ స్టేట్స్ గౌరవాధ్యక్షులు బి.వెంగమేష్ చౌదరి మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు తిప్పయ్య, గంగిరెడ్డిపల్లి నాయుడు, తుమ్మల చిన్నప్ప, ఈశ్వర్ నాయక్, మల్లాది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు,

ప్రశాంతంగా ముగిసిన ఖాద్రీ నృసింహుని రథోత్సవం

విశాలాంధ్ర,- కదిరి : పట్టణంలో వెలసిన శ్రీమద్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం ఎటువంటి ఆటంకాలు జరగకుండా జిల్లా ఎస్పీ వి.రత్న అడుగడుగునా భద్రత ఏర్పాటు చేయడంతో ఖాద్రీ నృసింహుని రథోత్సవం ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఖాద్రి నృసింహుని రథోత్సవం సందర్భంగా లక్షలాదిగా తరలి వచ్చిన భక్తులకు ఎక్కడ ఏ చిన్నపాటి అంతరాయం కలగకుండా బందోబస్తు నిర్వహించడం అభినందనీయమని పలువురికి అభినందనలు తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సిస్టమ్, డ్రోన్, సీసీ కెమెరాలతో రథోత్సవం ప్రాంతంతో పాటు పరిసరాలను పోలీసులు జల్లెడ పడుతూ ఎలాంటి దొంగతనాలు జరుగకుండా ప్రత్యేక క్రైమ్ టీమ్ ఏర్పాటు చేశారు. బందోబస్తులో డీఎస్పీ శివనారాయణ స్వామి, టౌన్ సీఐ డివినారాయణరెడ్డి, రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి, అర్బన్ గ్రేడ్ సిఐ నాగేంద్ర పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపన ద్వారా ఆర్థిక ప్రగతి : కలెక్టర్

విశాలాంధ్ర పుట్టపర్తి :- జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారా ఆర్థిక ప్రగతి సాధ్యమని కలెక్టర్ టి.ఎస్.చేతన్ స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి) సమావేశం నిర్వహించారు. జిల్లా పరిశ్రమల శాఖ పనితీరుపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు ఆయన పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహకాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అదే దిశగా జిల్లాలో కూడా పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఇండస్ట్రీయల్ పాలసీకి అనుగుణంగా జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహద పడేలా.. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనతో ఎక్కువమందికి ఉపాధి అవకాశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రొత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లతో సమన్వయం చేయడం జరుగుతుం దన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక నూతన పారిశ్రా మికవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. జిల్లా స్థాయి నుండి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపణపై అవగాహన పెంపొందించాలన్నారు.

అంగరంగ వైభవంగా ఖాద్రీ బ్రహ్మోత్సవం..

విశాలాంధ్ర-కదిరి టౌన్ : నవ నారసింహక్షేత్రాల్లో ప్రసిద్ధిగాంచిన ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం అత్యంత వైభవంగా గురువారం కన్నుల పండుగగా జరిగింది. ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, ఆలయ డిప్యూటీ కమిషనర్ వెండిదండీ శ్రీనివాస రెడ్డి, ప్రధాన అర్చకులు, జిల్లా యస్పీ రత్న ఆనవాయితీగా 8.15 నిమిషాలకు తేరు లాగి ప్రారంభించారు. అంతకుముందు వేద పండితులు వేద మంత్రాలతో శ్రీదేవి భూదేవి సమేతడై ఉరేగుతున్న శ్రీవారి బ్రహ్మ రథోత్సవానికి బలిహరణ, మహా నివేదన, కుంకుమార్చన, గుమ్మడి కాయలతో దిష్టి తీసి తేరు గమనాన్ని నిర్ధారించారు. అనంతరం కుటాగుళ్ళ, బేరిపల్లి, నాగిరెడ్డి పల్లి, మూర్తిపల్లి గ్రామాలకు చెందిన నరసింహస్వామి రథోత్సవ సేవకులు ఆనవాయితీగా వచ్చి తెడ్లు, మొక్కులు, కర్రల సహాయంతో తేరు లాగి అట్టహాసంగా ముందుకు తీసుకెళ్లారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారితో పాటు మన రాష్ట్రానికి చెందిన లక్షలాది భక్తులు రథోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. గోవింద నామ స్మరణలతో కదిరి పుర వీధులు మారుమ్రోగాయి. ఉదయం ఎనిమిది గంటల పదిహేను నిమిషాలకు ప్రారంభమైన తేరు యథాస్థానానికి రావడానికి మధ్యాహ్నం 3.53కు చేరుకుంది. సుమారు ఏడు గంటల పాటు పుర వీధుల గుండా శ్రీవారు విహరించారు. దవనం, మిరియాలు చల్లి భక్తులు కోర్కెలు తీర్చుకున్నారు. నాలుగు లక్షల మంది వేడుకను వీక్షించడానికి వచ్చినట్లు తెలుస్తోంది. భక్తులతో పుర వీధులు కిక్కిరిసిపోయాయి. అడుగడుగునా దాతలు భక్తులకు మంచి నీళ్ళు, ఆహారం అందించారు. కొందరు విందు భోజనం ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ రత్న అధ్యర్యంలో సుమారు 700 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు యంత్రాంగం తీసుకున్న చర్యలతో భక్తులకు హాయిగా ఉత్సవాలను తిలకించారు.

నకిలీ పట్టాతో నిర్మాణాలు చేపడుతున్న వారిపై కేసు నమోదు చేయాలి

- ప్లంబర్ కార్మికులకు పట్టాలివ్వాలి
- సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు

విశాలాంధ్ర-ధర్మవరం : సర్వేనెంబర్ 650-2 లో డూప్లికేట్ పట్టాలు చేయించుకొని నిర్మాణాలు చేపడుతున్న ఆక్రమణదారులపై 420 కేసులు వెంటనే నమోదు చేయాలని, ప్లంబర్ కార్మికులకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు తెలిపారు. ఈ మేరకు గురువారం పట్టణంలో తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం తెలిపారు. ఎమ్మార్వోను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సర్వేనెంబర్ 650-2 ప్లంబర్స్ కార్మికులు న్యాయం చేయాలని, ఎవరైతే అనర్హులు దొంగ పట్టాలు చేయించుకున్నారో వారి పట్టాలు రద్దు చేసి అర్హులైన ప్లంబర్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అలా చేయని పక్షంలో 24న భూ ఆక్రమణ జరిగిన స్థలంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పోలా లక్ష్మీనారాయణ, ప్లంబర్ అసోసియేషన్ నాయకులు అధ్యక్షులు, రాజు, కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆంజనేయులు, తాజ్, చిన్న పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు

విశాలాంధ్ర పుట్టపర్తి:- విద్యుత్ సంస్థల పని చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్‌కి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎస్ఈ జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ 15 సంవత్సరాల నుంచి విద్యుత్ మీటర్ రీడర్స్ విద్యుత్ సంస్థలో పనిచేస్తూ తక్కువ వేతనంతో జీవితాలను నెట్టుకొస్తున్న వారిపై ఒక్కసారిగా స్మార్ట్ మీటర్ల రూపంలో పిడుగు పడిందని స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల వేలాది మంది ఉద్యోగులు రోడ్డుపాలయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ మీటర్ రీడర్స్‌ను కనుకరించి ఉపాధి కోల్పోకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న జనవరి నుంచి ఫిబ్రవరి రెండు నెలలకు పెండింగ్‌లో ఉన్న జీతాలను కాంట్రాక్టర్లు వెంటనే చెల్లించాలన్నారు. ఎస్కో ద్వారా జీతాలు చెల్లించాలని జీవో ఉన్నప్పటికీ దాన్ని తుంగలో తొక్కి ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. వెంటనే కార్మికులపై వేధింపుల ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వినోద్‌కుమార్, ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్, కోశాధికారి దస్తగిరి, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు షానవాజ్, రాఘవరెడ్డి, బాబా, నరేష్, రవి, నాగేష్, వేణుగోపాల్, నాయక్, మీటర్ రీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న అటవీ సంపద

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

విశాలాంధ్ర, చిలమత్తూరు : మండల వ్యాప్తంగా కొందరు కలప వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా నిబంధనలు కాలరాసి అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమ రవాణా యదేచ్ఛగా సాగుతోంది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో రైతుల పొలాల్లో పంటలకు చెట్లు అడ్డంగా ఉన్నాయని.. పంటలు సరిగా పండవని అధికారులకు రైతులు ఫిర్యాదు చేస్తే కొమ్మలు మాత్రమే కొట్టేందుకు అనుమతి తీసుకుని ఇదే అదునుగా ఏకంగా మొదలకే ఎసరు పెట్టి భారీ చెట్లను సైతం నరికేస్తున్నారు, వృక్ష సంపదన కాపాడాల్సిన అటవీ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో మునుగుతున్నారు.ఒకవైపు వర్షాలు పడగానే విరివిగా మొక్కలు నాటాలని ప్రభుత్వం కోట్లలో డబ్బులు వెచ్చించి పర్యావరణం పచ్చగా చేయాలని టీవీలలో దిన పత్రికలలో ఎన్నో రకాలుగా ప్రచారం చేసినా ప్రయోజనం శూన్యం. పచ్చని చెట్లను నరికి రవాణా చేస్తున్న వారిపై కొరడా ఝలపించాలని చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఉద్దేశం బూడిదలో పోసిన పన్నీరులా మారింది. పచ్చని చెట్లు నరకడంతో ప్రాణవాయువు తగ్గిపోతున్నది.. కాలుష్యం పెరిగి వాతావరణ సమతుల్యం దెబ్బతింటుందని పర్యావరణ ప్రేమికులు చర్చించుకుంటున్నారు, ముఖ్యంగా చింత, వేప, కానుగ, టేకు తదితర చెట్లను తెగ నరికి తరలించేస్తున్నారు. అధికారులు మొక్కుబడి జరిమానాలు వేసి వారిని ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి,

చేతి వృత్తి కళాకారునికి రాష్ట్రపతి నుండి ఆహ్వానం..

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని శాంతినగర్‌లో వికలాంగుడైన చిప్పల చంద్రశేఖర్ చేతివృత్తి కళాకారుడుగా ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. తన వృత్తికి ఆర్డిటి సంస్థ అనంతపురం జిల్లాలోని బుక్కరాయ సముద్రంలో ఓ ఉద్యోగం కూడా కల్పించింది. ఈ ఉద్యోగం ద్వారా తన కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇతని ప్రతిభను గుర్తించిన న్యూఢిల్లీలోని ప్రెసిడెంట్ రాష్ట్రపతి భవన్ గుర్తించింది. దీంతో వారి ప్రదర్శనను రాష్ట్రపతి గవర్నర్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి ఆహ్వానించారు. దివ్యాంగుడైన చిప్పల చంద్రశేఖర్ కొన్ని సంవత్సరాలుగా బుక్కరాయసముద్రంలోని ఆర్డిటి సంస్థలో గల వికలాంగులకు తన చేతి వృత్తి శిక్షణ ఇస్తున్నారు. దేశంలో 12 మందికి ఈ అవకాశం రాగా, ఇందులో ఆంధ్రప్రదేశ్ తరపున ధర్మవరానికి చెందిన తనకు రావడం గర్వించదగ్గ విషయమని తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

అలరారించిన నృత్యాంజలి కార్యక్రమం

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని కళా జ్యోతిలో గురువారం ఏర్పాటుచేసిన మానస నృత్య కళ కేంద్రం వారి నృత్యంజలి కార్యక్రమ వేడుకలు అందరిని అలరారించాయని నాట్య గురువు మానస తెలిపారు. గురువు మానస మాట్లాడుతూ స్వర్గీయ నృత్య శిరోమనులకు ఈ నృత్యాంజలి కార్యక్రమం అంకితం చేయడం జరిగిందన్నారు. ముఖ్య అతిథులుగా తోలుబొమ్మలాట చిత్ర కళాకారులు దలవాయి చలపతి, రచయిత అండ్ దర్శకులు మురళీధర్, టీవీ అండ్ సినీ నటులు ఆకళ్ళ గోపాలకృష్ణ, టీవీ అండ్ సినిమా నటులు అల్లరి అర్జున్, రంగస్థలం, సినిమా, బుల్లితెరల నటులు మల్లాది భాస్కర్, రంగస్థలం సకలవృత్తి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆనంద్, అబ్బా టీవీ డాక్టర్ హరిప్రసాద్, వరల్డ్ లెదర్ పప్పెట్ అవార్డు గ్రహీత చిదంబర రావు, సాంస్కృతిక మండలి వ్యవస్థాపకులు నత్రశాల ప్రసన్న కుమార్, కళాజ్యోతి కార్యదర్శి పాలెం వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా విచ్చేశారన్నారు. 25 మంది చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు అందరినీ మొగ్గులు చేశాయన్నారు. ప్రతిభ కనబరిచిన అందరికీ కూడా ముఖ్య అతిథులు అభినందన పత్రాలు అందజేశారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ చిన్న వయసు లోనే మానస ఎంతోమందికి కళా విద్యను నేర్పడం గర్వించదగ్గ విషయమని తెలిపారు.

ఆరవ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని మోటుమర్ల గ్రామంలో గల కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో ఆరవ తరగతికి ఇంటర్మీ డియట్ ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఏ.చంద్రకళ తెలిపారు. గురువారం మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కొరకు దరఖాస్తులను స్వీకరించడానికి నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. ఈనెల 22వ తేదీ నుండి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్లైన్లోనే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కలదని తెలిపారు. కావున అనాధలు, తల్లి లేక తండ్రి లేని వారు, బడి బయట పిల్లలు, బడి మానివేసిన వారు, ఎస్సీ, ఎస్టీ ,ఓబీసీ, మైనారిటీ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కలదని తెలిపారు. మైనారిటీ విద్యార్థులకు అధిక అవకాశం ఉందని, ఎంపిక చేసిన విద్యార్థుల వివరాలు తల్లిదండ్రుల ఫోన్లకు రాష్ట్రం నుండి నేరుగా మెసేజ్ ద్వారా పంపబడుతుందని తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి విద్యార్థినితో పాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, విద్యార్థిని ఫోటో, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, చిరునామాతో కూడిన సెల్ నెంబర్ తప్పక ఆన్లైన్లో జతపరచాలన్నారు. ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు తమ పాఠశాలలో సంప్రదించవచ్చునని తెలిపారు.

బ్యాంకు రుణం తీర్చలేక రైలు కిందపడి రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర-ధర్మవరం : అనంతపురం జిల్లా రూరల్ మండలం కృష్ణంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉజ్జినప్ప (50 సంవత్సరాలు) వ్యవసాయానికి బ్యాంకుల వద్ద రుణం తీసుకొని పంటలు సరిగా పండక, ఆ రుణం ఎలా తీర్చాలో తెలియక ధర్మవరం మండలం కందుకూరు గ్రామ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. కొన్నేళ్లుగా వ్యవసాయం చేస్తూ పంటలు సరిగా పండక పోవడం బ్యాంకుకు చెల్లించాల్సిన రుణం ఎలా కట్టాలి? అంటూ మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నారని ధర్మవరం జి అర్‌పి రైల్వే పోలీసులు తెలిపారు. మృతులకు ఇద్దరు కుమారులు భార్య అరుణ ఉన్నారు. రైల్వే పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని బంధువులు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరాకరించిందని యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని గిర్రాజు కాలనీకి చెందిన బద్దెల ఓబు నాథ్ (35) తాను ప్రేమించిన అమ్మాయి పెళ్ళికి నిరాకరించిందని మనస్థాపం చెంది తన ఇంటిలోనే ఎవరూ లేని సమయంలో గవాచికి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు టైల్స్‌వర్క్ చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకునే వాడు. టూ టౌన్ పోలీసులు మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

అక్రమ మద్యం తరలింపు కేసులో ఇద్దరికి సంవత్సరం జైలు శిక్ష

రెండు లక్షల జరిమానా

విశాలాంధ్ర, గోరంట్ల .. కర్ణాటక ప్రాంతం నుండి అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుబడిన కేసులో ఇద్దరు నిందితులను ఒక్కొక్కరికి ఒక్కో సంవత్సరం జైలు శిక్ష రూ.2 లక్షల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని సీఐ బోయ శేఖర్ తెలిపారు, ధర్మవరం మారుతి నగర్‌కు చెందిన బి.శ్రీనాథ్ తండ్రి వెంకటేష్ మరియు కదిరి పట్టణం అడపాల వీధికి చెందిన జి.దేవిడ్‌నాథ్ తండ్రి రమేష్ 03.08.2020 తేదీ ఉదయం 04 గంటలకు అనుమతి లేకుండా కర్ణాటక రాష్ట్రం నుండి కర్ణాటక రాష్ట్ర తయారీ మద్యం 240 రెడికో 8 పిఎం విస్కీ 180 ఏం ఎల్ కర్ణాటక రాష్ట్ర తయారీ మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా అప్పటి గోరంట్ల పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టరు జే.జయ నాయక్ సిబ్బంది నిందితుడిని పట్టుకుని పెనుకొండ కోర్టులో హాజరుపరచగా వాదోపవాదాలు విన్న జడ్జి పై విధంగా తీర్పు వెలువరించారు.

ఖైదీలకు అన్ని వసతులు సక్రమంగా కల్పించాలి

విశాలాంధ్ర-ధర్మవరం : ఖైదీలకు అన్ని వసతులు కల్పించాలని అనంత పురం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ జైలు అధికారులను ఆదేశించారు. గురువారం ధర్మవరం సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీల గదులను, వంట గదు లను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో కాసేపు మాట్లాడుతూ మీకు ఎవరికైనా న్యాయవాదని పెట్టుకునే సోమత లేనియెడల ఉచితంగా న్యాయ వాదిని ఏర్పాటు చేస్తామని అటువంటి జైలు సూపర్డెంట్ బ్రహ్మారెడ్డికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. మీ సమస్యలు ఏమైనా ఉన్న యెడల నేరుగా గాని, సబ్ జైల్ సూపరింటెండెంట్ బ్రహ్మారెడ్డికి తెలుపవచ్చున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు నూర్ మొహమ్మద్ బాలసుందరి, జైలు సిబ్బంది పి ఎల్ వి షామీర్ భాష పాల్గొన్నారు.

కదిరి నరసింహస్వామి తేరులో అన్న ప్రసాద వితరణ

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండలో ప్రముఖ న్యాయవాది నాగరాజు వారి కుటుంబ సభ్యులు కలసి గురువారం కదిరిలో లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం తెరు సందర్భంగా అన్న ప్రసాద వితరణ చేశారు. మా ఇలవేల్పు లక్ష్మీ నరసింహ స్వామి భక్తులకు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని, ప్రతి ఏడాది ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు.

మండల సమాఖ్య సమావేశం వాయిదా

విశాలాంధ్ర-గోరంట్ల : గోరంట్లలోని మహాలక్ష్మి మండల సమాఖ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది, అయితే ఇద్దరు యానిమేటర్లను గుల్జార్ వరలక్ష్మి మరియు అకౌంటెంట్ కృష్ణవేణి లను ఇటీవల తొలగించడంతో గురువారం మండల సమైక్య సమావేశం ఏర్పాటు చేసి సభ్యుల ను తొలగింపు తీర్మానానికి ప్రయత్నించగా కోరం లేక సమావేశం వాయిదా పడింది. అదేవిధంగా కృష్ణవేణి గుంజా వరలక్ష్మిలు తమకు గ్రామములో తీర్మానం చేసి తొలగించాల్సి ఉండగా దొంగ సంతకాలు చేసి తమను అనవసరంగా రాజకీయం చేసి తొలగించారని వాగ్వివాదానికి దిగారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

విశాలాంధ్ర,-గోరంట్ల : ఉరి వేసుకుని యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బూదిలి గ్రామంలో చోటుచేసుకుంది. సిఐ బోయ శేఖర్ తెలిపిన వివరాలు. బూదిలి ఎస్ సి కాలనీకి చెందిన దళిత నారాయణమ్మ నరసింహప్పలు బ్రతుకు తెరువు కోసం బెంగుళూరులో కాపురం వుంటున్నారు,అయితే వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె విమల (24)వారి మేనమామ,మేనత్తలు కిష్టప్ప నాగలక్ష్మమ్మలకు పిల్లలు లేకపోవడంతో వారు వారి ఇంటిలోనే పెట్టుకున్నారు,గోరంట్ల పట్టణంలోని ఎంఆర్సి ఆవరణంలోని ప్రభుత్వ పాఠశాలలో గల అంధ ఉపాధ్యాయురాలు నిర్మల వద్ద సహాయకు రాలిగా పనిచేస్తూ ప్రతిరోజు పాఠశాలకు వెళ్లి వస్తోంది, అయితే రెండు రోజులుగా ఆరోగ్యం బాగాలేదని పాఠశాలకు వెళ్లడం లేదు. మేనమామ ఇంటి నుండి వారి సొంత ఇంటికి వెళ్లి చీరతో ఉరివేసుకొని వేలాడుతుండగా చుట్టుపక్కల వరకు గమనించి గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారి వినోద్‌కుమార్ నిర్ధారించారు, ఘటనతో యువతిని పెంచుకుంటున్న కిష్టప్ప నాగలక్ష్మమ్మలు ఆసుపత్రిలో బోరున విలపించారు, అనంతరం తల్లిదండ్రులకు సమాచారం అందించారు,కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

20 నుంచి పోషనా బి పడాయి బి శిక్షణ

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల కేంద్రంలో సిడిపిఓ శాంతి ఆదేశాల మేరకు స్థానిక జెడ్పి ఉర్దూ ఉన్నత పాఠశాలలో గురువారం మండలం లోని అంగన్వాడీ కార్యకర్తలకు మండల ఐసీడీఎస్ సూపర్వైజర్స్ 20,21,22 తేదీల్లో పోషణ బి పడాయి బి శిక్షణ కార్యక్ర మాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలకు 0 నుండి 3 సంవత్సరాల పిల్లలకు ఇచ్చే నవచేతన, 3 నుండి 6 సంవత్సరాల పిల్లలకు ఆధార్ శిలా గురించి తెలిపారు సూపర్వైజర్లు సిరాథా, లలితమ్మ సునీతమ్మ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తీర్చినందుకు హర్షం

విశాలాంధ్ర -గుడిబండ : చిగతుర్పి గ్రామంలోని నూతన కాలనీలో తాగునీటి ఎద్దడి తీర్చేందుకు కొత్తగా బోరు వేయించారు. పుష్కలంగా నీరు లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా బోరువేయడానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎంఎల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస మూర్తి, ఆర్డబ్ల్యూఎస్ ఎఈ హరీష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత కుట్టు మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ మున్సిపల్ కార్యాలయంలోని సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ సూచనల మేరకు బీసీ సంక్షేమ శాఖ ప్రకటించిన విధంగా కుట్టు మిషన్లు ట్రైనింగ్ ప్రోగ్రాం, ఉచిత కుట్టు మిషన్లు కొరకు దరఖాస్తులను పెనుకొండ సచివాలయంలో వెల్ఫేర్ ఆఫీసర్, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్స్ దరఖాస్తులను స్వీకరించారు. బీసీలు ఆర్థికంగా వెనుకబడిన ఓసీలు, ఈ కుట్టు మిషన్ల ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తులను 23వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు, కార్యక్రమంలో టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, నాయకులు అరుణ, లక్ష్మీ దేవమ్మ,పులుగూర శ్రీనివాసులు,కురుబ నంజుండ, గోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రవర్తనను మెరుగుపరచుకోవాలి

విశాలాంధ్ర-అగళి : నేటి ఆధునిక విద్యా విధానంలో విద్యార్థుల ప్రవర్తనలో మార్పుల కోసం దేశంలో మొట్ట మొదటి సారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం " కెరీర్ గైడెన్స్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్స్‌ని సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నదని కెరీర్ గైడెన్స్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ రామకృష్ణ తెలిపారు. కేజీబీవీ స్కూల్స్‌లో 'పర్సనాలిటీ డెవలప్మెంట్' సెషన్ నిర్వహిస్తామన్నారు. మానసిక ఒత్తిడి, ఆత్మవిశ్వాసం లేమి వల్ల విద్యార్థులు చెడు ప్రవర్తన ప్రదర్శించే అవకాశముందని కౌన్సెలింగ్, ధ్యానం, యోగా వంటి వ్యాయామాలు వారికి మానసిక ప్రశాంతత ఇస్తాయని తెలిపారు. నైపుణ్యాల అభివృద్ధి విద్య నైపుణ్యాలను (సాఫ్ట్ స్కిల్స్) అభివృద్ధి చేయడం చాలా ముఖ్యం అన్నారు.

పేదలకు, రోగులకు చేసే సేవ దైవ ..

విశాలాంధ్ర-ధర్మవరం : పేదలకు, రోగులకు చేసే సేవ దైవ సేవతో సమానమని శ్రీ సత్యసాయి సేవాసమితి-2 సుబ్బదాసు భజన మందిరం-టిఆర్టి సర్కిల్ నిర్వాహకులు తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం అల్పాహారమును (పాలు, బ్రెడ్,బిస్కెట్లు) దాదాపు 150 మందికి నర్సులు, వైద్యులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలతో ఇటువంటి సేవా కార్యక్రమాన్ని కొన్ని సంవత్సరాలుగా నిర్వహించడం మాకెంతో సంతోషాన్ని ఇస్తుందని తెలిపారు. నేటి ఈ సేవా కార్యక్రమానికి దాతగా పెనుకొండ మండలం తహసీల్దార్ కార్యాలయంలోని వీఆర్వో బాలయ్య నిర్వహించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ మాధవి మాట్లాడుతూ సత్య సాయి సేవా సమితి వారు చేస్తున్న ఈ సేవలు ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తాయని తెలిపారు. మరింత మంది దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 21, మార్చి 2025

పొలంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు

రైతులకు పొంచి ఉన్న ప్రమాదం

విశాలాంధ్ర - ఉరవకొండ : ఉరవకొండ నియోజకవర్గం గడేకల్లు గ్రామంలో రైతుల పొలాల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడి ప్రమాదకరంగా మారాయి. రైతులు పొలాల్లో పనులు చేసుకోవాలంటే ఏప్పుడు ఏమి ప్రమాదం జరుగుతుందో అని ఆందోళన చెందుతూ వ్యవసాయం చేసుకుంటున్నారు. విద్యుత్ తీగల వల్ల తమకు ప్రమాదం పొంచి ఉందని అనేకసార్లు గ్రామ రైతులు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో పనులు చేయాలంటే ఇద్దరు వ్యక్తులు విద్యుత్ తీగలను కట్టెలతో పైకెత్తి వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన రైతులు ఆంజనేయ, భీమలింగప్ప మాట్లాడుతూ గత అనేక రోజులుగా తమ పొలాల్లో విద్యుత్ తీగలు నెలకు తాకే విధంగా వేలాడుతున్నాయని ఇప్పటికే పలుమార్లు కొంతమంది రైతులు విద్యుత్ షాక్ కు గురయ్యారని పశువులు కూడా ప్రమాదంలో మృతి చెందాయని అయినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. తమ పొలాల్లో పనులు చేయడానికి కూడా కూలీలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక విద్యుత్ శాఖ ఏఈ కిందస్థాయి సిబ్బంది ఈ సమస్యను పరిష్కరించడానికి చొరవ చూపడం లేదని మరిన్ని ప్రమాదాలు జరగక ముందే జిల్లాస్థాయి విద్యుత్ శాఖ అధికారులు అయినా వెంటనే స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-ఉరవకొండ : జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు గురువారం సిఐ మహానంది ఆధ్వర్యంలో పోలీసులు యాంటీ డ్రగ్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ గంజాయి, తదితర మత్తు పదార్థాలు వాడకం వల్ల ఆరోగ్యం క్షీణించడమే కాకుండా ప్రాణాపాయం తలెత్తి జీవితాలు నాశనమవుతాయన్నారు. మత్తు పదార్థాల జోలికెళ్లకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉద్యోగాలే లక్ష్యంగా ఇప్పటి నుండీ సిద్ధం కావాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడితే దేహాన్ని మనకు తెలియకుండానే అవి పీల్చిపిప్పి చేస్తాయని అంతేకాదు తనపై నియంత్రణ కోల్పోయి విచక్షణారహితంగా ప్రవర్తించేలా చేస్తుందని తెలిపారు.ఎట్టి పరిస్థితుల్లోనూ మాదక ద్రవ్యాల జోలికెళ్ల రాదని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులలో సైబర్ మోసాల పట్ల అవగాహన ముఖ్యమని... పలు సైబర్ మోసాల గురించి కూడా విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం..

విశాలాంధ్ర-కూడేరు : కూటమి ప్రభుత్వం. ఎస్సి వర్గీకరణ చేపట్టడం హర్షించదగ్గ విషయమని వీ.హెచ్. పి.ఎస్., ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ మాదిగ మాదిగ ఉప కులాలకు జరుగుతున్న అన్యాయాలపై ఏబీసీడీ వర్గీకరణ చేస్తేనే మాదిగలకు ఉప కులాలకు న్యాయం జరుగుతుందని 1994 నుండి దాదాపుగ 30 సంవత్సరాల కాలం నుండి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటాలు చేయడం జరిగిందన్నారు. జాతి ఎప్పుడు రుణపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్నతో పాటు ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాల ఈశ్వరయ్య, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, ఎంఎస్‌పి మండల అధ్యక్షులు మహేష్ యాదవ్, వీహెచ్పీఎస్ మండల అధ్యక్షులు శ్రీరాములు, మండల కార్యదర్శి రామాంజనేయులు, సిద్ధప్ప, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

అగాపే ఆశ్రమంలో నిత్యవసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర -యాడికి : మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో గురువారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. గత సంవత్సర క్రితం పెన్నా కాలేజీ ద్వారా మహాబలిపురానికి ట్రిప్ కు వెళ్ళిన స్టూడెంట్స్ లలో ఇద్దరు స్టూడెంట్స్ పెద్దవడుగూరు మండలం అప్పిచెర్ల గ్రామానికి చెందిన శేషారెడ్డి యాడికి మండలం కుందనకోట గ్రామానికి చెందిన పెద్దిరాజు సముద్రంలో చనిపోవడం మనకందరికీ తెలిసిందే. వారి స్నేహితులు వీరన్న పల్లె కమలేశ్వర్ మహేష్ రెడ్డి పవన్ కళ్యాణ్ వీరు తమ స్నేహితుల జ్ఞాపకార్థమై అగాపే ఆశ్రమానికి 2 నెలల సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు బత్తల ప్రసాద్ మాట్లాడుతూ, సొంత వారి కోసం ఏమీ చేయలేనట్టు వంటి సమాజంలో స్నేహితుల కోసం, ఇంత దాతృత్వం చాటిన వారి స్నేహితులను కొనియాడారు.

కేజీబీవీలో దరఖాస్తులు స్వీకరణ

విశాలాంధ్ర - అగళి : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశాలకు మార్చి 22 నుంచి ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ తెలిపారు. కేజీబీవీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం, 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్టు చెప్పారు. ఆన్లైన్ దరఖాస్తులు మార్చి 22 నుంచి ఏప్రిల్ 11 వరకు అందుబాటులో ఉంటాయన్నారు.అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ పరిధిలోని బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణనలోకి తీసుకుంటామన్నారు. దరఖాస్తులు https://apkgbv.apcfss.in/ ద్వారా పొందవచ్చని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా మెసేజ్ వస్తుందన్నారు.

బీజేపీ యాడికి మండల అధ్యక్షునిగా వద్ది రాజశేఖర్

విశాలాంధ్ర -యాడికి : మండల కేంద్రం బిజెపి కార్యాలయంలో గురువారం మండల నూతన అధ్యక్షుడి ఎంపిక సమావేశం సంబంధిత కార్యనిర్వాహకులు ఏర్పాటు చేశారు ముఖ్య అతిథులుగా జంగం అంకాల రెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు సింగరి లక్ష్మీనారాయణ రాష్ట్ర లీగల్ కన్వీనర్ ప్రతాపరెడ్డి తదితరులు హాజరై వద్ది రాజశేఖర్ ను యాడికి మండల అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఎప్పుడు ధర్మం వైపు నడుస్తుందని అన్నారు బీసీ సామాజిక వర్గానికి చెందిన నేను పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని దీంతో పాటు ప్రజా సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించే దిశగా అడుగులు వేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రైతన్నలు సహకరించాలి

విశాలాంధ్ర - యాడికి: ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని వేములపాడు కోన ఉప్పలపాడు గ్రామాలలో తహసీల్దార్ ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కార్యక్రమానికి రైతన్నలు హాజరు కావడం సంతోషదాయకమన్నారు, తమ భూములను సర్వే చేయించుకుంటున్నప్పుడు సంబంధిత రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని కోరారు. సమస్యల భూములు, వాటి వివరాలు సిబ్బందికి అందజేస్తే రీ సర్వే ప్రక్రియ సులభతరం అన్నారు. అనంతరం గ్రామంలోని ప్రజలకు తాసిల్దార్ ప్రతాపరెడ్డి మొక్కలు పంపిణీ చేసి ఇంటి పరిసరాలలో మొక్కలు నటాలని, పర్యావరణాన్ని కాపాడాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో త హసిల్దార్ ప్రతాపరెడ్డి, డీటీ శ్రీనివాసులు, రీసర్వే డిటీ రాజ్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అడవులను, వన్యప్రాణులను రక్షించాలి

విశాలాంధ్ర- పెనుకొండ : అనంతపురము, శ్రీ సత్య సాయి జిల్లాలలో ఫిబ్రవరి, మార్చి,ఏప్రిల్ నెలల్లో కొద్ది మంది ప్రజలు వివిధ కారణాలతో కొండలను నిప్పు పెట్టి కొండలో ఉన్న పచ్చని చెట్లు, వివిధ రకాల గడ్డిని కాలిచ్చివేస్తున్నారు. కొత్తగా మెలకెత్తిన మొక్కలు, వివిధ రకాల విత్తనాలు కాలి బూడిద అవుతున్నాయి, అడవి జంతువుల చిన్న పిల్లలు,వివిధ రకాల క్రిమి కీటకాలు, పాములు,పక్షులు వాటి గుడ్లు,చిన్న పిల్లలు కాలి బూడిద అవుతున్నాయి,దీనివల్ల కొండల పచ్చదనం లేక బోడి కొండలగా మారిపోతున్నాయి,ఈ కొండలు అన్ని నల్లగా, బూడిద రంగులోకి మారుతున్నాయి. కొండలలో రాళ్లు, మట్టి, గడ్డి తప్ప ఏమీ లేవు,అనేక పక్షులు, జంతువులు, చెట్లు రోజు రోజుకు మాయం అవుతున్నాయి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ జిల్లాలలోని ఉపాధి కూలీలను ఫిబ్రవరి, మార్చి,ఏప్రిల్ నెలలో కొండలకు అగ్గి పెట్టకుండా కాపాడడానికి కొండలు చుట్టూ గార్డ్స్ నియమించాలి,కొండల చుట్టూ అక్కడ అక్కడ సెక్యూరిటీ కోసం టవర్స్ నిర్మాణం చేయాలి,డ్రోమ్ కెమెరాలు ఉపయోగించాలి,సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి, కొండలను కాపాడుకోపోతే, భవిష్యత్ తరాలకు భారీ నష్టం జరుగుతుందని పర్యావరణం సమతుల్యము లేకుండా పోతుందని మరి ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో ఇటువంటి పరిణామాలు జరగకుండా అందరూ బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని నిపుణులు తెలుపుతున్నారు పెనుకొండ ప్రాంతంలో మొత్తం కొండలను బోడి గుట్టలను కాల్చివేశారు వీటిపై ప్రభుత్వము చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టీడ్కో గృహాలను పరిశీలించిన సీపీఎం నేతలు

విశాలాంధ్ర - ధర్మవరం : పట్టణ పరిధిలోని ఎల్ 4 కాలనీ సమీపంలో ప్రభుత్వం నిర్మించిన అపార్ట్మెంట్‌లను గురువారం సిపిఎం నాయకులు జంగాలపల్లి పెద్దన్న,ఆలకుంట మారుతీ, టీ.అయూబ్ ఖాన్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017సంవత్సరం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం లబ్దిదారులను ఎంపిక చేసి ఈ గృహాల నిర్మాణం చేపట్టారని, ఆతరువాత 2019 నుండి 2024వరకు అధికారంలో వున్న వైసీపీ ప్రభుత్వం కూడా ఈ గృహాలని పూర్తి చేసి లబ్దిదారులకు అందజేయలేదన్నారు. ఇప్పుడు ఏర్పాటు అయిన కూటమి ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎవరు కూడా ఇప్పటికి ఇక్కడ కన్నెత్తి చూడలేదన్నారు.టీడ్కో గృహాల నిర్మాణం చేపట్టి దాదాపు ఎనిమిది సంవత్సరాల కాలం పూర్తి కావస్తున్న, ఇప్పటికీ మూడు సార్లు ప్రభుత్వాలుమారిన,ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యే, క్యాబినెట్ మంత్రి సత్తి కుమార్ యాదవ్ అయినప్పటికీ, పూర్తి కాకుండా అసంపూర్తిగా ఉన్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సముదాయలను ఇప్పటకైనా పేదలకి అందజే యాలనీ డిమాండ్ చేశారు. ఈ పనులు ప్రారంభం చేసినప్పటి నుండి ఇప్పుడుకి ముగ్గురు ముఖ్యమంత్రులు మారినరాని, అదేవిదంగా కాంట్రాక్టర్‌లు కూడా ముగ్గురు మారటం జరిగినదని తెలిపారు. ఇక్కడ కనీస సౌకర్యాలు అయిన విద్యుత్, రోడ్డు, డ్రైనేజీ పనులు వంటివి తలుచుకుంటే ఇంకా చాలా దారుణంగా ఉన్నాయని, పనులకు వాడిన సామాగ్రి నాసిరకమైనది వినియోగించారని, ఇక్కడ పనులను పరిశీలించడం వలన మేము ప్రత్యక్షంగా చూసామన్నారు అని తెలిపారు. లబ్ధిదారులకి గృహాలని అందజేయకనే గోడలుకి పగుళ్ళు వచ్చాయని, వీటిలో పేదల నివాసం సాధ్యం కాదని స్పష్టం చేశారు. సమీపంలో వున్న ఎల్ 4- ఎల్ 3,కాలనీ లలో కూడా ప్రజలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న మంచినీరు, వీధి లైట్లు, డ్రైనేజీ కాలువలు,కుక్కల బెడద కూడా అధికంగా ఉందని స్థానికులు నాయకులుకి తెలిపారు. ఇన్ని సమస్యలకి నిలయంగా వున్న ఈప్రాంతాలలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యటిస్తే ప్రజా సమస్యలు తెలుస్తాయన్నారు . ప్రజా సమస్యలు పై ఈ నెల 25 జిల్లా కేంద్రం పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయము వద్ద జరిపే నిరసన కార్యక్రమానికి సిపిఎం నాయకులు కార్యకర్తలు, పేద ప్రజలతో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున తరలి రావాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు గంపు హరి, నాయకులు వెంకటస్వామి, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఆదాయ వనరులకు నేడు వేలంపాట

విశాలాంధ్ర-ఉరవకొండ : వజ్రకరూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఆదాయ వనారులకు శుక్రవారం కార్యాలయం నందు వేలం పాటలు నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ మోనాలిసా, కార్యదర్శి మల్లయ్య తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో జరుగు దినసరి సంత వాటర్ ప్లాంట్‌కు మధ్యాహ్నం రెండు గంటలకువేలం పాటలు నిర్వహిస్తున్నమన్నారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు గ్రామపంచాయతీకి ఎటు వంటి బకాయిలు ఉండరాదని,వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.25వేలు చెల్లించాలన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని స్థానికులు,మేజర్లు మాత్రమే వేలం పాటలో పాల్గొనవ లెనాని,వేలము నందు హెచ్చు పాటదారినిగా నిలిచిన వారు ప్రభుత్వం నియమ నిబంధనల మేరకు ఈసంవత్సరం ఏప్రిల్ 4 నుంచి 2026 మార్చి 31వరకు సుంకము వసూలు చేసుకొనవలెనని తెలిపారు.గ్రామ ప్రజలు ఎవరైనా వేలంపాటలో పాల్గొనాలను కున్నవారు శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు పంచాయితీ కార్యాలయం నందు హాజరు కావలెనని తెలిపారు.

ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి

విశాలాంధ్ర - ధర్మవరం : దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు పదవ తరగతి స్పాట్ వాల్యూషన్లో మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు సెట్టిపి జయచంద్ర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 3న నిర్వహించబోయే పదవ తరగతి స్పాట్ వేల్యూషన్ సంబంధించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, ఫిజికల్లీ ఛాలెంజ్డ్, విజువల్లీ ఛాలెంజ్డ్ ,ఉపాధ్యాయులకు, 58సంవత్సరాలు నిండినవారు, మానసిక రుగ్మత (మెంటలీ రిటర్టెడ్) పిల్లలు ఉన్నా వారికి, వ్యక్తిగత లెటర్లు తీసుకొని ముందుగానే వారి కోరిక మేరకు స్పాట్ నుండి మినహాయింపు ఇవ్వాలని వారు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా శాఖ పక్షాన శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప, ధర్మవరం ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. ఎస్‌జిటిలకు స్పెషల్ అసిస్టెంట్ డ్యూటీలు 25 సంవత్సరాలు సర్వీస్ నిండి, 50 ఏళ్లు పైబడి ఎస్జీటీలుగానే పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులకు స్పెషల్ అసిస్టెంట్ డ్యూటీలు నుండి మినహాయింపు ఇవ్వాలని, అలాగే ఏలూరు చుట్టుపక్కల మండలాలకు సమాన ప్రాతినిధ్యంలో డ్యూటీలు వేయాలని, జిల్లా నుండి దూర ప్రాంతంలో ఉన్న మండలాలకు ఎక్కువ దూరం వెళ్తున్న ఉపాధ్యాయులు వారి కోరిక మేరకు డ్యూటీలు వారి విల్లింగ్ తీసుకొన్న తర్వాతనే వేయాలని అధికారులను కోరడం జరిగిందన్నారు. అదేవిధంగా 2018 ఉపాధ్యాయులకు స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ వారు ఇచ్చిన ఆదేశాలు అనుసరించి కాకుండా జిల్లాలో వివిధ మండలాల్లో వివిధ విధాలుగా జాయినింగ్ తేదీని వేయడం జరిగింది అని తెలిపారు. స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ వారి ఆదేశాల ప్రకారం 2018 డీఎస్సీ వారి జాయినింగ్ తేదీ సెప్టెంబర్ 28, 2020 పైన విధుల్లో చేర్చుకోవలసిందిగా ఆదేశాలు ఇవ్వడం జరిగింది అని అన్నారు. కానీ ఉమ్మడి జిల్లాలోని ఇతర మండలాల్లో సెప్టెంబర్ 26, 27గా జాయిన్ తేదీలు వేయడం జరిగింది అని, కానీ రొల్ల, ఆగలి, మడకశిర, గుడిబండ మండలాలలో జాయినింగ్ తేదీని సెప్టెంబర్ 28, 2020గా వేయడం జరిగింది అన్నారు. దీనివలన ఆ నాలుగు మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నష్టపోవడం జరుగుతుంది అని తెలిపారు. కావున వారికి న్యాయం చేయగలరని కోరారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2008 డీఎస్సీ వారికి కూడా ఇలాంటి జాయినింగ్ తేదీ సమస్యను ఆ జిల్లా డీఈవో దృష్టికి తీసుకువెళ్లగా వారు, ఆ విషయంపై విచారణ జరిపి 2008 డీఎస్సీలో సెలెక్ట్ అయిన ఉపాధ్యాయులు అందరికీ ఒకే జాయిన్ వేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు రామకృష్ణ నాయక్, ఆంజనేయులు, లక్ష్మయ్య, రాంప్రసాద్, మల్లేష్, అమర్నాథ్ రెడ్డి, రామాంజినేయులు, సకల చంద్రశేఖర్, సురేష్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన పాఠశాల గదులను పరిశీలించిన తహశీల్దార్

విశాలాంధ్ర - శెట్టూరు : గత రెండురోజుల క్రితం మూతపడ్డ "డా" బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలముందు ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యులు విద్యార్థి సంఘం నాయకులు ఎమ్మార్పీఎస్ ఆర్జే ప్రకాష్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనకార్యక్రమం చేపట్టి ప్రభుత్వ ఉన్నతాధికారులు దృష్టికితీసుకెళ్లడం స్పందించిన ప్రభుత్వ అధికారులు గురువారం మండల పరిధిలోని ములకలేడు(పెరుగు పాళ్యం)లో గత15సంవత్సరాల క్రితం మూతపడ్డ సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు గత రెండు సంవత్సరాల కిందట ప్రభుత్వం మంజూరు చేసింది ఈ విద్యా సంవత్సరం లోప్రారంభించాలని మూత పడటం వల్ల ఎంతో మంది నిరుపేద దళిత విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇదే హాస్టల్లోచదివిన విద్యార్థులు ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారు .కావున భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొనిగురుకుల పాఠశాల ను పునఃప్రారంభించాలన్నారు.ఈవిషయం రెండు రోజుల క్రితంవివిధ పత్రికల్లో ప్రచురితమైంది అయితే స్థానిక తహశీల్దార్ ఈశ్వరయ్య శెట్టి విషయం పై స్పందించి గురుకుల పాఠశాలనుపరిశీలించివాస్తవాలనుతెలుసుకొన్నారు. పూర్తీ వివరాలు సేకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ముందు కెళ్తామన్నారు. ఎస్సిఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాలఅధ్యక్షులు అక్కులప్ప మాదిగ,ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షులు టైగర్ వన్నూరు స్వామి, కల్యాణదుర్గంనియోజకవర్గ అధ్యక్షులు కుందిర్పిలక్ష్మణమూర్తిలు హర్షం వ్యక్తం చేశారు.

నారాయణ సేవలో అన్నదానం

విశాలాంధ్ర- పెనుకొండ : పెనుకొండ ప్రభుత్వ హాస్పిటల్‌కు వైద్య చికిత్సల కొరకు వచ్చినటువంటి గర్భిణీ స్త్రీలకు వారి సహాయకులకు అనారోగ్యంతో వచ్చిన వారికి, సదరన్ క్యాంపుకు వచ్చినటువంటి వయోవృద్ధులకు, వికలాంగులకు మరియు ఆరోగ్య కార్యకర్తలకు, సుమారు 150మందికి అన్నదానం, వాటర్ పాకెట్లు అందజేసినారు. ఈ సేవా కార్యక్రమానికి, గురువారం స్వరూప జన్మదిన సందర్భంగా, వీరి యొక్క తల్లిదండ్రులు శ్యామలమ్మ, శివానందరెడ్డి , సహకరించి, సేవలో పాల్గొన్నారు,స్వరూప కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయుచు, మాకు ఈ సేవా భాగ్యాన్ని కలిగించినటువంటి వీరికి, వీరి కుటుంబ సభ్యులకు, కృతజ్ఞతలు తెలియజేస్తూ, వీరికి భగవాన్ బాబా వారి యొక్క అనుగ్రహ ఆశీస్సులు కలగాలని కోరుకుంటున్నామని సత్యసాయి సేవా సమితి తాలూకా అధ్యక్షులు శంకర్ తెలిపారు.

అంగన్‌వాడి కార్యకర్తలకు శిక్షణ తరగతులు

విశాలాంధ్ర -గుడిబండ : మండల కేంద్రంలోని ఎంజెపి జూనియర్ కళాశాలలో మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ గంగరత్న తెలిపారు. ఈ క్రమంలో ఆమె మాట్లాడుతూ పోషణ బి పడాయి బీ యొక్క లక్ష్యాలు మూడు సంవత్సరాల లోపు పిల్లలకు ప్రేరణ కార్యక్రమం పైన నవచేతన మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు ఆదర్శ శిలా కార్యక్రమం నిర్వహణాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కమలమ్మ, అంగనవాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో గుమ్మనూరు ఈశ్వర్

విశాలాంధ్ర - గుత్తి : పట్టణం మెయిన్ బజార్ జామియా మసీదులో రంజాన్ మాసం ఉపవాస దీక్షలో ముస్లిం సోదరుల కోసం ముల్లా బషీర్,కేజీఎన్ షాషా,కేజీఎన్ షఫీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందుకు గుత్తి,పామిడి మండల ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ హాజరయ్యారు. అనంతరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విరమించారు. ఈ సందర్భంగా మసీదు ఆవరణలో ఉపవాస దీక్షాపరులు కోసం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందును గుత్తి,పామిడి టిడిపి మండల ఇన్చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ప్రారంభించారు. గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ.. ఉపవాస దీక్ష ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటుచేసిన ఈ ఇఫ్తార్ విందులో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు ఎంకే చౌదరి, బద్రీవలి, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్లు చికెన్ శీనా, జక్కలచెరువు ప్రతాప్, బోయ రమేష్, పిలేల్లి కృష్ణయ్య,పిలేల్లి సుధాకర్, లక్ష్మణ్,రాజా కూటమి నాయకులు,ముస్లిం మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సామాన్య ప్రజల ప్రాణాల పట్ల చెలగాటలాడితే కఠిన చర్యలు

విశాలాంధ్ర - గార్లదిన్నె : మండల పోలీసులు రహదారి ప్రమాదాల నివారణపై దృష్టి సారించి ప్రతిరోజు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై పరిశీలనలు చేస్తూనే ఉన్నారు. అందులో భాగంగా సంక్రాంతి పర్వదినం రోజు తమ విధి నిర్వహణలో భాగంగా గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలోని తరిమెల రోడ్డు క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై పరిశీలనలు జరిపి అక్కడ ప్రమాద సూచికలను అమర్చి రేడియం సూచిక బోర్డులను స్వయానా పోలీసులు శుభ్రపరచి సరైన దిశలో అమర్చి బొలెరో ఆటో లలో పరిమితికి మించి కూలీలను ఎక్కించుకొని వెళ్తున్న వాహనాలను ఆపి చలానా వేసి వారి పైన చర్యలు తీసుకుంటాం సరుకు రవాణాకు ఉపయోగించాల్సిన వాహనాలను కూలీలను తరలిస్తున్నారని వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులకు రహదారి పక్కన చిన్న చిన్న కోట్లు ఏర్పాటు చేసుకున్న వారికి సరైన దిశా నిర్దేశం చేసి తగిన సూచనలు అందించారు.